ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక

నేటి నుంచి 99 రోజుల ప్రజాపాలన

5

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

J V NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక -305 శుక్రవారం 6 మార్చి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## గోదావరి పుష్కరాల కోసం తెలంగాణ

# కేబినెట్ సబ్ కమిటీ

### కమిటీ చైర్మన్‌గా మంత్రి శ్రీధర్ బాబు.. కన్వీనర్‌గా దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి

**గోదావరి పుష్కరాల నిర్వహణపై 9 మందితో కూడిన కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు**

**2027 జూలై 23 నుంచి ప్రారంభం కానున్న గోదావరి పుష్కరాలు**

**ప్రధాన ఆలయాలు, ఘాట్ల వద్ద శాశ్వత ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ ఆదేశం**

**కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు, ప్యాకేజీ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న ప్రభుత్వం**

**హైదరాబాద్,మార్చి5(జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా జరగనున్న గోదావరి పుష్కరాలకు (2027) ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు ప్రారంభించింది. 'దక్షిణ కుంభమేళా'గా పిలిచే ఈ



మహా క్రతువు నిర్వహణ, ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది మంది సభ్యులతో కూడిన కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. కమిటీ సభ్యులుగా మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ**మిగతా2లో...**



## రెండు రాజ్యసభ స్థానాలకు

# కాంగ్రెస్ నామినేషన్

**అభిషేక్ సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి నామినేషన్ పత్రాల దాఖలు**

సీఎం రేవంత్ రెడ్డికి సన్నిహితుడైన నరేందర్ రెడ్డికి దక్కిన అవకాశం

అసెంబ్లీలో కాంగ్రెస్‌కు పూర్తి బలం.. ఏకగ్రీవ ఎన్నిక లాంఛనమే

ఈ నెల 16న ఎన్నికలు.. నామినేషన్లకు నేడే చివరి రోజు



**హైదరాబాద్,మార్చి5(జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణ నుంచి ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, సీఎం రేవంత్ రెడ్డి సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఇవాళ నామినేషన్లు దాఖలు చేశారు. శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు నాయకత్వంలో వీరు తెలంగాణ అసెంబ్లీలో రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డికి తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు హాజరయ్యారు. **మిగతాది 2లో...**



# ముగిసిన నితీశ్ శకం

**రాజ్యసభకు నామినేషన్ వేసిన నితీశ్ కుమార్**

**బీహార్ సీఎం పదవిని చేపట్టబోతున్న బీజేపీ!**

**సీఎం రేసులో సామ్రాట్ , నిత్యానంద , దిలీప్ జైశ్వాల్**

పాట్నా,**మార్చి5(జర్నలిస్ట్ వార్త);**
బీహార్ రాజకీయాల్లో సుదీర్ఘ కాలం పాటు ముఖ్యమంత్రిగా చక్రం తిప్పిన నితీశ్ కుమార్, రాష్ట్ర రాజకీయాల నుంచి తప్పుకుని జాతీయ రాజకీయాల వైపు అడుగులు వేయడం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసిన నేపథ్యంలో ఆయన త్వరలోనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నారు. **మిగతా2లో...**

# తెలంగాణలో భానుడి భగభగ...

**హైదరాబాద్,మార్చి5**
తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగతో పగటిపూట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. మార్చి మొదటి వారంలోనే ఎండలు తీవ్రస్థాయికి చేరుకుంటున్నాయి. గురువారం ములుగు జిల్లా మంగపేటలో**మిగతా2లో...**...



**ములుగులో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు**

**పెరుగుతున్న పగటిపూట ఉష్ణోగ్రతలు**

**ఆదిలాబాద్, ఖమ్మం, జగిత్యాలలో అత్యధిక ఉష్ణోగ్రతలు**

**వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచన**

# తెలంగాణ కొత్త గవర్నర్ గా శివ ప్రతాప్ శుక్లా

**దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల గవర్నర్లను మారుస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు**

**తెలంగాణ గవర్నర్‌గా హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా నియామకం**

**ప్రస్తుత తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మహారాష్ట్రకు బదిలీ**

**ఢిల్లీ మరియు లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ల స్థానాల్లోనూ మార్పులు**



# తెలుగు రాష్ట్రాల్లో టెన్త్ పరీక్షలకు రెడీ

**తెలంగాణలో 14 నుంచి, ఎపిలో 16 నుంచి పరీక్షలు**

**వాట్సాప్ ద్వారా హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్‌కు అవకాశం**

**హైదరాబాద్,మార్చి5(జర్నలిస్ట్ వార్త);**
తెలుగు రాష్ట్రాల్లో పదో తరగతి పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు విడుదలయ్యాయి. తెలంగాణలో మార్చి14 నుంచి.. ఏపీలో16 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పరీక్షలకు ఇంకా కొన్ని రోజులు మాత్రమే గడువు ఉంది. దీంతో ఆయా రాష్ట్రాల ఎస్‌ఎస్‌సీ బోర్డులు **మిగతా2లో...**



# చర్చలు, దౌత్యంతోనే సమస్యలకు పరిష్కారం

**ఫిన్లాండ్ అధ్యక్షుడు స్టబ్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు**

**ఉగ్రవాద నిర్మూలనే ఇరువురి ఉమ్మడి లక్ష్యం అని ప్రకటన**

**వలసలు, మొబిలిటీపై భారత్, ఫిన్లాండ్ కీలక ఒప్పందం**

**విద్యా రంగంలో పరస్పర సహకారానికి నిర్ణయం**

**మార్చి5(జర్నలిస్ట్ వార్త);**
ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్ మరోసారి శాంతి మంత్రం జపించింది. కేవలం సైనిక చర్యలతో ఏ సమస్యా పరిష్కారం కాదని, చర్చలు, దౌత్యమే సరైన మార్గమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. గురువారం నాడు ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం ఇరువురు నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. **మిగతా2లో...**



# మూసీ పేరుతో దోపిడీ

**బీఆర్ఎస్ హయాంలో ఐదున్నర కిలోమీటర్ల పొడవున సుందరీకరణ పనులు చేశామన్న కేటీఆర్**

**ప్రజల ఆస్తులకు నష్టం చేయకుండా అభివృద్ధి చేయవచ్చని నిరూపించామన్న కేటీఆర్**

**సుందరీకరణ పనులు తమకు అప్పగిస్తే రూ.16 వేల కోట్లకే చేసి చూపిస్తామని సవాల్**

**హైదరాబాద్,మార్చి5(జర్నలిస్ట్ వార్త);**
విధ్వంసం చేయకుండా, ఎవరి ఇళ్లు కూల్చకుండా కూడా అభివృద్ధి, సుందరీకరణ పనులు చేయవచ్చని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. . బీఆర్ఎస్ పాలనలో వికాసం, కాంగ్రెస్ పాలనలో విధ్వంసం కొనసాగుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క ఇటుకను పేర్చనోడికి కూల్చే హక్కులేదని మండిపడ్డారు. నాగోల్ మూసీ పరీవాహక ప్రాంతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సుందరీకరణ పనులను గురువారం బీఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలించారు. **మిగతా2లో...**



## తెలంగాణలో భానుడి భగభగ...

(మొదటి పేజీ తరువాయి)

అత్యధికంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్, ఖమ్మం, జగిత్యాలలో 38.9 డిగ్రీలు, మంచిర్యాలలో 38.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. వృద్ధులు, పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ములుగు, ఆదిలాబాద్, జగిత్యాల, ఖమ్మం, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, కుమురంభీమ్, నాగర్ కర్నూలు, నిజామాబాద్ తదితర జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్, సిద్దిపేట తదితర జిల్లాల్లో 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

# ముగిసిన నితీశ్ శకం

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో, బీహార్ తదుపరి ముఖ్యమంత్రి ఎవరనే చర్చ పెద్ద ఎత్తున జరుగుతోంది.

ప్రస్తుత అంచనాల ప్రకారం, కొత్త ప్రభుత్వంలో బీజేపీ ముఖ్యమంత్రి పదవిని దక్కించుకోనుంది. ఈ రేసులో ప్రధానంగా ముగ్గురు నేతల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వారు ఎవరంటే...?

సామ్రాట్ చౌదరి: ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సామ్రాట్ చౌదరి సీఎం రేసులో అందరికంటే ముందున్నారు. ఓబీసీ (కుష్వాహా) సామాజికవర్గానికి చెందిన ఆయనకు పార్టీలో, ప్రభుత్వంలో పట్టు ఉండటం ప్లస్ పాయింట్.నిత్యానంద రాయ్: కేంద్ర మంత్రిగా ఉన్న నిత్యానంద రాయ్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. యాదవ సామాజికవర్గానికి చెందిన ఈయనను సీఎంగా చేయడం ద్వారా, ఆర్జేడీ (తేజస్వి యాదవ్) ఓటు బ్యాంకుకు గండి కొట్టాలని బీజేపీ భావిస్తోంది. అమిత్ షాతో నిత్యానంద రాయ్ కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి.దిలీప్ జైశ్వాల్: బీహార్ మంత్రి దిలీప్ జైశ్వాల్ పేరు కూడా పరిశీలనలో ఉంది. వైశ్య సామాజికవర్గానికి చెందిన ఈయనకు పార్టీ అధిష్ఠానం వద్ద మంచి గుర్తింపు ఉంది.

## తెలుగు రాష్ట్రాల్లో టెన్త్ పరీక్షలకు రెడీ

(మొదటి పేజీ తరువాయి)

పరీక్షల హాల్‌టికెట్లను గురువారం విడుదల చేశాయి. వివిధ విభాగాలకు చెందిన విద్యార్థుల హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లలో వేర్వేరుగా అందుబాటులో అధికారులు ఉంచారు. తెలంగాణలో విద్యార్థులు తమ హాల్‌టికెట్లను బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్‌సైట్ , ఏపీ విద్యార్థులు వాట్సాప్‌లో హాల్ టికెట్లు పొందవచ్చు. ఇక ఏపీ విద్యార్థులు మనమిత్ర (వాట్సాప్ నంబర్ 9552300009) లేదా లీప్ యాప్ ద్వారా.. అలాగే తెలంగాణ విద్యార్థులు వాట్సప్ నంబర్ (8096958096) ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలా కుదరకుంటే.. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల వద్ద నుంచి కూడా ఈ పరీక్ష హాల్ టికెట్లను విద్యార్థులు పొందవచ్చు. తెలంగాణ అభ్యర్థులు 8096958096 వాట్సప్ నంబర్‌కు హాయ్ అని సందేశం చేయగానే మీ ఫోన్‌కి వెల్‌కమ్‌టూ మీ సేవ అని వస్తుంది. చాట్‌లో టైప్ చేసి మెసేజ్ చేయండి. మీ మొబైల్‌కు ఒక లింక్ వస్తుంది. ఆ లింక్‌ను ఓపెన్ చేసి జిల్లా, పాఠశాల పేరును ఎంచుకోండి.

విద్యార్థి పేరు, పుట్టిన తేదీ నమోదు చేస్తే హాల్‌టికెట్ మీ ఫోన్‌లోనే వస్తుంది. ఈ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసి భద్రపరుచుకోండి. ఏపీలో వాట్సప్‌లో డౌన్‌లోడ్ ఇలా.. మీ ఫోన్‌లో 552300009 నంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపాలి. సర్వీస్ సెలక్షన్ అనే ఆప్షన్ వస్తుంది. ఎడ్యుకేషన్ సర్వీసెస్‌ను ఎంచుకోండి.అక్కడ ఎస్ఎస్సీ హాల్‌టికెట్ అనే ఆప్షన్‌ను సెలక్ట్ చేసుకోవాలి. అప్లికేషన్ నంబర్/ చైల్డ్ ఐడీతోపాటు పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేయాలి. రెగ్యులర్/ప్రైవేట్/ ఓఎస్ఎస్-సీ రెగ్యులర్/ఒకేషనల్‌లలో మీకు సంబంధించిన కేటగిరీని ఎంచుకొని కన్‌ఫర్మ్ చేయాలి. ఆ తర్వాత కొన్ని నిమిషాలకు హాల్‌టికెట్ మీ వాట్సప్ నంబర్‌కే వస్తుంది. ఈ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసి భద్రపరుచుకోవాలని సూచించారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ



**హైదరాబాద్,మార్చి5(జర్నలిస్ట్ వార్త);**

పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ కొనసాగుతోంది. గురువారం కడియం శ్రీహరిని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారించారు. కొన్ని గంటలపాటు సాగిన ఈ విచారణ ముగిసింది.

మరో ఎమ్మెల్యే దానం నాగేందర్ విచారణ పూర్తి కాలేదు. ఆయన విచారణను శనివారానికి అంటే.. మార్చి 7వ తేదీకి వాయిదా వేశారు. ఈ కేసులో శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు విచారణకు హాజరు కావాలని ఇరు వర్గాలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ రావు సూచించారు. దీంతో ఈ పిటిషన్లను స్పీకర్ శనివారం విచారించనున్నారు. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొన్న పలువురి ఎమ్మెల్యేల విచారణ ఇప్పటికే పూర్తయింది. వారందరికి స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లీన్ చీట్ ఇచ్చిన విషయం విదితమే. ఈ కేసులో ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను విచారించాల్సి ఉంది. ఆయన విచారణ కూడా పూర్తయితే.. ఈ ఫిరాయింపుల వ్యవహారం ఒక కొలిక్కి వస్తుంది.

## లిక్కర్ కేసు కొట్టేయడంతో స్వామికి మొక్కు

**తిరుమలకు కాలినడకన చేరుకున్న కవిత**

**త్వరలోనే రాజకీయ పార్టీ ఏర్పాటు**

**తెలంగాణ ఫస్ట్ నినాదంతో ముందుకు వెళతామని ప్రకటన**



తిరుపతి,**మార్చి5(జర్నలిస్ట్ వార్త);** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తిరుమలకు కాలినడకన వెళ్లి శ్రీవారిని దర్శనం చేసుకునేందుకు తిరుపతి చేరుకున్నారు. తిరుపతిలోని అలిపిరి వద్ద నుంచి కాలినడకన తిరుమల బయల్దేరిన ఆమె.. ముందుగా మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.. గత నాలుగేళ్లుగా చేయని తప్పుకు తాను మానసిక వేదన అనుభవించానని కవిత తెలిపారు. అయితే దేవుడి దయతో తనపై ఉన్న కేసును కోర్టు పూర్తిగా కొట్టివేసిందని చెప్పారు. ఆ కేసు నుంచి విముక్తి లభిస్తే కాలినడకన తిరుమలకు వచ్చి స్వామివారిని దర్శించుకుంటానని మొక్కుకున్నానని, ఆ మొక్కును తీర్చుకోవడానికి ఇప్పుడు తిరుమలకు వచ్చానని వెల్లడించారు. అదే సమయంలో తెలంగాణ రాజకీయాల్లో కీలక ప్రకటన చేశారు. మరో రెండు నెలల్లో తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈ పార్టీని స్థాపించనున్నట్లు చెప్పారు. కుల, మత, వర్గ భేదాలు లేకుండా ప్రజలకు సేవ చేసే పార్టీగా దీనిని తీర్చిదిద్దుతామని కవిత తెలిపారు. తెలంగాణ ఫస్ట్ అనే నినాదంతో ప్రజల సమస్యలను మైక్రో లెవెల్‌లో పరిష్కరించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పాత్రను బీఆర్ఎస్ సరిగా నిర్వహించలేకపోయాయని ఆమె విమర్శించారు. మరోవైపు.. ఆంధ్రప్రదేశ్ ప్రజలపై తమకు ఎలాంటి ద్వేషం లేదని, రాజకీయ ఆధిపత్యాన్ని మాత్రమే వ్యతిరేకించామని కవిత స్పష్టం చేశారు. అలాగే హైడ్రా చర్యలపై కూడా ఆమె విమర్శలు గుప్పించారు. హైడ్రా పేదలను ఇబ్బంది పెట్టి పెద్దల కోసం పనిచేస్తోందని ఆరోపించారు. తాను ఎప్పుడూ పేదల పక్షాన నిలబడి పోరాడతానని కవిత అన్నారు. అలాగే తనకు న్యాయం చేసిన న్యాయవ్యవస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

---

# చర్చలు, దౌత్యంతోనే సమస్యలకు పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో నెలకొన్న ఘర్షణలను ముగించేందుకు జరిగే ప్రతి ప్రయత్నానికి భారత్ మద్దతు ఇస్తుందని మోదీ హామీ ఇచ్చారు. చట్టం, న్యాయం, ప్రజాస్వామ్య విలువలపై భారత్, ఫిన్లాండ్‌లకు ఒకే రకమైన అభిప్రాయం ఉందని ఆయన తెలిపారు.

ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అత్యవసరమని ఇరువురు నేతలు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ నిర్మూలించడమే తమ ఉమ్మడి లక్ష్యమని మోదీ పేర్కొన్నారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ 'ఐరన్‌మ్యాన్ ట్రయాథ్లాన్' పూర్తి చేయడాన్ని ప్రస్తావిస్తూ మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మీరు ఐరన్‌మ్యాన్ ట్రయాథ్లాన్ పూర్తి చేశారు.. మీలాంటి శక్తివంతమైన నాయకత్వంతో భారత్, ఫిన్లాండ్ కూడా ఇన్నోవేషన్, డిజిటల్, సస్టైనబిలిటీ అనే కొత్త 'ట్రయాథ్లాన్'ను సాధిస్తాయని నాకు నమ్మకం ఉంది" అని మోదీ చమత్కరించారు.

**కొత్త శకంలో భారత్-యూరప్ బంధం**

ప్రస్తుతం ప్రపంచం అస్థిరత, అనిశ్చితి మధ్య ఉందని, ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు అనేక ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచంలోని రెండు పెద్ద దౌత్య శక్తులైన భారత్, యూరప్ మధ్య సంబంధాలు స్వర్ణయుగంలోకి ప్రవేశిస్తున్నాయని ఆయన అభివర్ణించారు. 2026 ప్రారంభంలో కుదిరిన చారిత్రాత్మక 'ఇండియా-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' గురించి ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ఒప్పందం ద్వారా భారత్, ఫిన్లాండ్ మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక సహకారం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**కీలక ఒప్పందాలపై సంతకాలు**

ఇరు దేశాల మధ్య ఆవిష్కరణల వ్యవస్థను అనుసంధానించేందుకు సమగ్ర 'మైగ్రేషన్ అండ్ మొబిలిటీ' (వలసలు మరియు రాకపోకల) ఒప్పందంపై సంతకాలు చేసినట్లు ప్రధాని ప్రకటించారు. భారతీయ విద్యార్థులకు, ప్రతిభావంతులకు ఫిన్లాండ్ ఇప్పుడు ఒక ప్రాధాన్య గమ్యస్థానంగా మారుతోందన్నారు. ఈ ఒప్పందం వల్ల ఇరు దేశాల మధ్య పరిశోధనలు, స్టార్టప్ సహకారం మరింత బలపడుతుందని తెలిపారు. విద్యా రంగంలో ఫిన్లాండ్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడిన మోదీ.. ఉపాధ్యాయ శిక్షణ, స్కూల్-టు-స్కూల్ భాగస్వామ్యం, భవిష్యత్ విద్యా విధానాలపై సహకారాన్ని విస్తరించుకోవడానికి అంగీకరించినట్లు వెల్లడించారు. నార్డిక్ ప్రాంతంలో ఫిన్లాండ్ భారత్‌కు ముఖ్యమైన భాగస్వామి అని, ఆర్కిటిక్, ధృవ ప్రాంతాల పరిశోధనల్లోనూ తమ సహకారం కొనసాగుతుందని మోదీ స్పష్టం చేశారు.

# రెండు రాజ్యసభ స్థానాలకు కాంగ్రెస్ నామినేషన్

(మొదటి పేజీ తరువాయి)

అంతకుముందు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఈ ఇద్దరి పేర్లను అధికారికంగా ప్రకటించింది. జాతీయ స్థాయిలో పార్టీకి న్యాయపరమైన అంశాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీకి కాంగ్రెస్ అధిష్ఠానం మరోసారి అవకాశం కల్పించింది. ఆయన వాగ్ధాటి, పార్లమెంటులో చురుకైన పాత్ర పార్టీకి ఆస్తిగా భావిస్తోంది. ఇక, రెండో అభ్యర్థిగా పలువురు సీనియర్ నేతల పేర్లు ప్రచారంలో ఉన్నప్పటికీ, అధిష్ఠానం మాత్రం సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు, ఆయన సలహాదారుగా ఉన్న వేం నరేందర్ రెడ్డి వైపు మొగ్గు చూపింది.

ప్రస్తుతం సిట్టింగ్ సభ్యులుగా ఉన్న అభిషేక్ మను సింఘ్వీ, కేఆర్ సురేశ్ రెడ్డిల పదవీకాలం ఏప్రిల్ 9తో ముగియనుండటంతో ఈ ఎన్నికలు అనివార్యమయ్యాయి. 2024లో కాంగ్రెస్‌లో చేరిన కె. కేశవరావు రాజీనామాతో ఖాళీ అయిన స్థానానికి సింఘ్వీ ఎన్నికైన విషయం తెలిసిందే. ఇక, కేఆర్ సురేశ్ రెడ్డి ప్రస్తుతం బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేతగా ఉన్నారు.

ఈ నెల 16న రాజ్యసభ ఎన్నికల పోలింగ్ జరగనుండగా, నామినేషన్ల దాఖలుకు ఇవాళే చివరి రోజు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపకపోవడంతో కాంగ్రెస్ అభ్యర్థులు ఇద్దరూ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. 119 మంది సభ్యులున్న తెలంగాణ అసెంబ్లీలో రెండు స్థానాలను గెలుచుకోవడానికి అవసరమైన సంఖ్యాబలం అధికార కాంగ్రెస్ పార్టీకి ఉంది. కాంగ్రెస్‌కు 66 మంది ఎమ్మెల్యేలు ఉండగా, మిత్రపక్షం సీపీఐకి ఒక సభ్యుడు ఉన్నారు. కాంగ్రెస్‌కు మిత్రపక్షంగా భావించే ఎంఐఎంకు ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. మరోవైపు బీఆర్ఎస్‌కు అధికారికంగా 37 మంది సభ్యులు ఉన్నప్పటికీ, వారిలో దాదాపు 10 మంది 2024లోనే కాంగ్రెస్‌కు మద్దతు పలికారు. బీజేపీకి 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ సంఖ్యాబలం దృష్ట్యా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు లాంఛనప్రాయమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# గోదావరి పుష్కరాల కోసం తెలంగాణ కేబినెట్ సబ్ కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పి.సుదర్శన్ రెడ్డిలను నియమించారు. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అవసరాన్ని బట్టి గోదావరి తీర ప్రాంతాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ప్రత్యేక ఆహ్వానితులుగా సమావేశాలకు పిలవనున్నారు. త్వరలోనే కమిటీ సమావేశమై సిఫార్సులను అందజేయనుంది.

2027 జూలై 23న గోదావరి పుష్కరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈసారి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కేంద్రం నుంచి ప్రత్యేక ప్యాకేజీ కోరాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో సుమారు 560 కిలోమీటర్ల మేర గోదావరి ప్రవహిస్తుండటంతో దాదాపు 74 ఘాట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ముఖ్యంగా బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలం ఆలయాల వద్ద రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో అక్కడ ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం సూచించారు.

పుష్కరాల ఏర్పాట్లు తాత్కాలికంగా కాకుండా, శాశ్వత ప్రాతిపదికన ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ఆలయాల అభివృద్ధి, పర్మనెంట్ పుష్కర ఘాట్లు, రోడ్లు, వసతి సముదాయాలు నిర్మించాలని ఆదేశించారు. రోజుకు రెండు లక్షల మంది భక్తులు వచ్చినా ఇబ్బంది లేకుండా ట్రాఫిక్, పార్కింగ్, మంచినీటి సౌకర్యాలు కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# మూసీ పేరుతో కాంగ్రెస్ దోపిడీ







(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాడు మూసీలోని మురుగు నీరుని శుద్ధి చేయాలని బీఆర్ఎస్ ముందుకెళ్లింది. దేశంలోనే అతిపెద్దది అయిన నాగోల్ ఎస్టీపీని రూ. 4వేలకోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇండ్లు కూల్చకండా, భూములు కోల్పోకుండా మూసీని అభివృద్ధి చేశామన్నారు. 2023 డిసెంబర్ వరకు 85 శాతం ఎస్టీపీ నిర్మాణం పూర్తయింది. 15 బ్రిడ్జీలు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసింది. మిగతా పెండింగ్ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బంగారుపల్లెంలో పెట్టి కేసీఆర్ తెలంగాణను అప్పగించారు. కాంగ్రెస్ స్వార్థం కోసం రూ. 16 వేల కోట్ల అయ్యే ప్రాజెక్ట్ వ్యయం పది రెట్లు పెంచి 1.50లక్షల కోట్ల భారీ స్కాంకు తెరతీశారని ఆరోపించారు. హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకం సృష్టిస్తున్నది. రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి ఇల్లు ఎఫ్‌టీఎల్ జోన్‌లో ఉంది అది కూలగొట్టే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. ప్రజలను రోడ్డున పడేసి ఏం సాధిస్తారన్నారు. సీఎం రేవంత్, మంత్రులు ఇలా అందరి ఇళ్లు బఫర్ జోన్‌లో ఉన్నాయి. మహబూబ్‌నగర్‌లో దివ్యాంగులు ఇళ్లు కూల్చారు. ఖమ్మంలో పేదల గుడిసెలను బుల్డోజర్లతో నేలమట్టం చేశారు. ఇవన్నీ రాహుల్ గాంధీకి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలను బయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్‌కు రూ.16 వేల కోట్లతో మూసీని సుందరీకరించడం చేతకాకపోతే మేము చేసి చూపిస్తామని సవాల్ విసిరారు. రాష్ట్రంలో హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు హద్దే లేదని కేటీఆర్ విమర్శించారు. పేదల ఇళ్లు కూల్చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.1.50 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ పనులు చేస్తామని సీఎం రేవంత్ చెబుతున్నారు. రూ.16వేల కోట్లతోనే ఆ పనులను చేయొచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు గెలిపించింది హామీల అమలు కోసమేనని గుర్తు చేశారు. రెండున్నరేళ్లలో ఒక్క ఇల్లు నిర్మించినట్లు చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటా. మూసీ సుందరీకరణ పనుల బాధ్యత మాకు అప్పగిస్తే రూ.16వేల కోట్లకే చేసి చూపిస్తాం. ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా అభివృద్ధి చేస్తాం అని కేటీఆర్ అన్నారు. కెటిఆర్ వెంట మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి తదితరులు ఉన్నారు.

# తెలంగాణ కొత్త గవర్నర్ గా శివ ప్రతాప్ శుక్లా



**హైదరాబాద్,మార్చి5(జర్నలిస్ట్ వార్త);**

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల గవర్నర్లు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లను బదిలీ చేస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. మార్చి 5న వెలువడిన తాజా ఉత్తర్వుల ప్రకారం.. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, బీహార్ తదితర రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించారు.

ముఖ్యంగా తెలంగాణ గవర్నర్ పదవిలో మార్పు చోటుచేసుకుంది. ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా ఉన్న శివ ప్రతాప్ శుక్లాను తెలంగాణ నూతన గవర్నర్‌గా నియమించారు. ఇప్పటివరకు తెలంగాణ గవర్నర్‌గా వ్యవహరించిన జిష్ణు దేవ్ వర్మను మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీ చేశారు.

**ఇతర రాష్ట్రాల గవర్నర్లు, ఎల్జీల బదిలీల వివరాలు ఇలా ఉన్నాయి:**

లి ఢిల్లీ: లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న వినయ్ కుమార్ సక్సేనాను లడఖ్ ఎల్జీగా పంపగా, ఆయన స్థానంలో ఢిల్లీ కొత్త ఎల్జీగా తరంజిత్ సింగ్ సంధును నియమించారు.

లి తమిళనాడు: కేరళ గవర్నర్‌గా ఉన్న రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను తమిళనాడు గవర్నర్‌గా బదిలీ చేశారు.

లి పశ్చిమ బెంగాల్: తమిళనాడు గవర్నర్‌గా ఉన్న ఆర్.ఎన్. రవిని పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా నియమించారు.

లి హిమాచల్ ప్రదేశ్: లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న కవిందర్ గుప్తాను హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా నియమించారు.

లి బీహార్: లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) సయ్యద్ అతా హస్నైన్‌ను బీహార్ గవర్నర్‌గా నియమించారు.

లి నాగాలాండ్: నంద్ కిశోర్ యాదవ్‌ను నాగాలాండ్ గవర్నర్‌గా నియమించారు.

రాష్ట్రపతి ఆమోదంతో ఈ ఉత్తర్వులు తక్షణం అమల్లోకి వచ్చాయి. పరిపాలనా సౌలభ్యం, వ్యూహాత్మక కారణాల దృష్ట్యా ఈ మార్పులు జరిగినట్లు తెలుస్తోంది. కొత్తగా నియమితులైన గవర్నర్లు త్వరలోనే ఆయా రాష్ట్రాల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

## ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాల,అంగన్వాడి కేంద్రాన్ని

# ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.

**బయ్యారం/మార్చి 5.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలంలోని ఇర్సులాపురంలోని ఆశ్రమ పాఠశాల, అంగన్వాడి కేంద్రం,ప్రాథమిక పాఠశాలలను గురువారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాల,అంగన్వాడి కేంద్రంలలో స్టాక్, రిజిస్టర్,పిల్లలు,ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్,స్టోర్ గది,డైనింగ్ హాల్, కిచెన్ షెడ్,స్టడీ రూమ్,పరిసరాలను పరిశీలించారు.పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూరానున్న పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో షెడ్యూలు ప్రకారం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని విద్యార్థులకు ఏలాంటి మానసిక ఒత్తిడి లేకుండా వారికి అర్థమయ్యే విధంగా నూతన డిజిటల్ తరగతులు ప్రాక్టికల్స్ ద్వారా విద్యను అందించాలని, పక్కాగా డైట్ మెనూ పాటించాలన్నారు.తద్వారా



పిల్లలు మంచి వాతావరణంలో విద్యను కొనసాగించి ఉత్తమ ఫలితాలు సాధించుటకు ఉపయోగపడతాయన్నారు. ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు కచ్చితంగా సమయపాలన పాటించి సిలబస్ పూర్తి చేయాలన్నారు.ప్రతి విద్యార్థిని, గమనిస్తూ ఉండాలని, విద్యలో వెనుకబడిన పిల్లలను



గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రోత్సహించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు పౌష్టిక ఆహారం అందిస్తూ వారికి అర్థమయ్యే రీతిలో పాఠాలను బోధించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దేశీరాం నాయక్, స్థానిక తహసిల్దార్ నాగరాజు, ఎంపీడీవో దీపిక ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

# పురుగుల మందు సేవించిన వృద్ధుడు..

## ఎంజిఎంకు తరలింపు

**భీమదేవరపల్లి/మార్చి5 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామానికి చెందిన సంగ రాజయ్య (60) ఇంటి వద్ద పురుగుల మందు సేవించిన ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న వెంటనే 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. పైలట్ దయాకర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ లింగమూర్తి ప్రాథమిక చికిత్స అందిస్తూ.. వెంటనే ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. పురుగుల మందు సేవించడానికి గల కారణాలు తెలియరాలేదు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# సీనియర్ విలేకరి కుటుంబానికి జెఎస్ఆర్ పరామర్శ





**భీమదేవరపల్లి/మార్చి5 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం చంటయ్యపల్లి గ్రామానికి చెందిన సీనియర్ విలేకరి ఎర్రబెల్లి వెంకట రమణ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గురువారం ఆయన చంటయ్యపల్లి గ్రామానికి వెళ్లి రమణ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రమణ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెఎస్ఆర్ మాట్లాడుతూ రమణ రెడ్డి మృతి పత్రికా రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గొల్లపల్లి వీరాచారి, నరసింహ రెడ్డి, నరేందర్ రెడ్డి, శివ, ఆంజనేయులు, రజనీకాంత్, కోల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్తఫాపూర్‌లో నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

### లబ్ధిదారురాలు రమ ఆనందం నాయకుల శుభాకాంక్షలు

**భీమదేవరపల్లి/మార్చి5 (జర్నలిస్ట్ వార్త):**
ముస్తఫాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం పైలెట్ గ్రామ పంచాయతీ భీమదేవరపల్లిలో ఇప్పటికే పలు గృహప్రవేశాలు జరుగగా, ఈసారి ముస్తఫాపూర్ గ్రామానికి చెందిన ఇందిరమ్మ లబ్ధిదారురాలు రమ ఇంటిలో శుభకార్యాన్ని నిర్వహించారు.



ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.వై థామస్, ఎల్కతుర్తి మార్కెట్ వైస్ చైర్మన్ స్రవంతి శ్రీనివాస్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి నాగరాజు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జక్కుల అనిల్ యాదవ్, ముస్తఫాపూర్ గ్రామ ఉప సర్పంచ్, మండల ఉప సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు తాళ్ల అరవింద్ గౌడ్, మేఘన వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు సుహాసిని, గ్రామ కార్యదర్శి వీరన్న, స్పెషల్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతుందని పేర్కొన్నారు. లబ్ధిదారురాలు రమకు శుభాకాంక్షలు తెలియజేసి, కొత్త ఇంటిలో సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పేదలకు ఇళ్ల కేటాయింపులో న్యాయం చేయాలి : బీజేపీ వినతి

**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో మార్చి 5 (జర్నలిస్ట్ వార్త):**
ధర్మసాగర్ మండలంలో నిజమైన పేదలను గుర్తించి అర్హులైన వారికి ఇండ్లను మంజూరు చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు మండల అభివృద్ధి అధికారిని (ఎంపీడీఓ) కలిసి వినతి పత్రం సమర్పించారు. గురువారం బీజేపీ నాయకుడు గుండె విజయరామారావు సూచనలతో భైరపాక కుమార్ ఆధ్వర్యంలో నాయకులు




ఎంపీడీఓను కలిసి సమస్యను వివరించారు.మండలంలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న అనేక మంది నిజమైన పేదలకు ఇప్పటికీ ఇళ్లు లేకపోవడం బాధాకరమని నాయకులు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ పథకాలలో అర్హులైన పేదలకు ప్రాధాన్యత ఇచ్చి వెంటనే ఇళ్లు మంజూరు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు మొరే రాజేందర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు గాజ శ్యామ్, సీనియర్ నాయకుడు పెరుమాండ్ల అమరేందర్ రెడ్డి, కిసాన్ మోర్చా నాయకుడు దుస్సా రాములు, మండల జీఎస్ సాయం సందీప్, భీంరెడ్డి రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లోటుపాట్లు గుర్తించేందుకే సామాజిక తనిఖీ

## పిడి రామ్ రెడ్డి

**రాయపర్తి/మార్చి 5 (జర్నలిస్ట్ వార్త):**
ఉపాధి హామీ పనుల్లో లోటుపాట్లు, అవకతవకలు గుర్తించి పారదర్శకత తీసుకురావడానికే ప్రతి సంవత్సరం సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహిస్తున్నట్లు డిఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రామ్ రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన 16వ సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులు సక్రమంగా జరిగాయా లేదా అన్నది ప్రజల సమక్షంలో సమీక్షించడం ఈ ప్రజా వేదిక ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. గత ఏడాది ఏప్రిల్ 2024 నుండి మార్చి 31, 2025 వరకు




మండలంలోని 40 గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందం సిద్ధం చేసిన నివేదికను ప్రజల ముందు చదివి వినిపించారు. పనుల అమలులో తలెత్తిన లోటుపాట్లను సరిదిద్దుకోవడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకునే విధంగా చర్యలు కొనసాగుతాయని తెలిపారు.కార్యక్రమంలో ఎంపీడీవో కిషన్, ఏపీఓ కుమార్, పంచాయతీ రాజ్ సహాయ ఇంజనీర్ శ్రీప్రియ, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పెండింగ్ వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి: ఏఐటీయూసీ



**కల్లూరు/ మార్చి 5 (జర్నలిస్ట్ వార్త):** మున్సిపాలిటీ కార్మికులకు ఏడు నెలలుగా, మెప్మా రిసోర్స్ పర్సన్‌లకు తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కల్లూరు మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మోహన్ నాయక్, కమిషనర్‌కు వినతి పత్రాలు సమర్పించారు.గత తొమ్మిది నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ భారం మోయలేక అప్పుల పాలవుతున్నామని, రోజువారీ జీవనం సాగించడమే కష్టంగా మారిందని అధికారులకు తెలియజేశారు. మున్సిపాలిటీ కార్మికులు, మెప్మా రిసోర్స్ పర్సన్‌లు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విడివిడిగా వినతి పత్రాలు అందజేశారు.ఈనెల 19వ తేదీలోగా వేతనాలు చెల్లించకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని వారు హెచ్చరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మోహన్ నాయక్ మాట్లాడుతూ సమస్యను ఎమ్మెల్యే మరియు మంత్రుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో పరిష్కారం కల్పిస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, దామాల దయాకర్ రావు, మున్సిపాలిటీ కార్మిక సంఘ జిల్లా నాయకులు ఊడల కృష్ణమూర్తి, వజీర్ మియా, లక్కినేని ప్రవీణ్, మెప్మా రిసోర్స్ పర్సన్‌లు కుమారి, పద్మ, శివ నాగలక్ష్మి, అనూష తదితరులు పాల్గొన్నారు.

## గాయపడిన టిడిపి కార్యకర్తను పరామర్శించిన వనమా వాసు



**ఖమ్మం/మార్చి5(జర్నలిస్ట్ వార్త):**
వేంసూరు మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ వేంసూరు గ్రామ శాఖ కమిటీ అధ్యక్షుడు షేక్ బోలా (48) ప్రమాదవశాత్తు జరిగిన ఘటనలో కాలు విరిగి గాయపడిన నేపథ్యంలో ఖమ్మం జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకుడు వనమా వాసు పరామర్శించారు.
గాయపడిన షేక్ బోలాను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న వనమా వాసు, పార్టీ కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. కార్యకర్తల కష్టసుఖాల్లో పార్టీ నాయకులు తోడుగా నిలబడతారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వైద్య చికిత్స ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొంతు భాస్కరరావు, తెలుగింటి ఆడపడుచులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# లారీ ఢీకొని వృద్ధురాలి మృతి

**ఎల్కతుర్తి/ మార్చి 5 (జర్నలిస్ట్ వార్త):**
మండల కేంద్రంలో లారీ ఢీకొన్న ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం భీమదేవరపల్లి మండలానికి చెందిన గంగిరెడ్డి రాధమ్మ (64) తన కుమారుడు గంగిరెడ్డి కిరణ్‌తో కలిసి హుజురాబాద్ నుంచి ఎల్కతుర్తికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మధ్యప్రదేశ్‌కు చెందిన ఎం.పీ 09 ఎల్ 5525 నంబరు గల లారీ వెనుక నుంచి ఢీకొట్టింది.లారీ డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో జరిగిన ఈ ప్రమాదంలో రాధమ్మ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు మృతురాలి కుమారుడు గంగిరెడ్డి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.సంఘటన సమాచారం అందుకున్న వెంటనే ఎస్సై ప్రవీణ్ కుమార్ ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఇదిలా ఉండగా ఎల్కతుర్తి మండల కేంద్రంలో వరుసగా ప్రమాదాలు జరుగుతున్నాయని సిపిఐ నాయకుడు రాములు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాలను అరికట్టేందుకు రహదారి పక్కన వెంటనే మొర్రం పోయాలని, అంబేద్కర్ కూడలిలో సిద్ధిపేట, కరీంనగర్, వరంగల్ దిశలను సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను మీడియా ద్వారా కోరారు.

# బాధితుల్లో న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగించాలి

## పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్







**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో మార్చి 5 (జర్నలిస్ట్ వార్త):** పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడిలో న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగేలా పోలీసులు విధులు నిర్వర్తించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. గురువారం ఆయన ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి అధికారుల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్‌కు ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రావు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను పరిశీలించిన సీపీ, స్టేషన్ పరిధిలోని గ్రామాలు, అక్కడి ప్రజల జీవన విధానం, ఎక్కువగా నమోదవుతున్న నేరాలు, రౌడీ షీటర్లు, అనుమానితుల వివరాలు, బీట్ వ్యవస్థ, పెట్రోలింగ్ విధానం, పోలీస్ అధికారుల పనితీరు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై ఇన్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై పోలీసులు తక్షణమే స్పందించాలని, విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించకుండా బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. పారదర్శకంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందేలా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఎస్‌ఐలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అవకాశాలను వినియోగించుకుని ఆకాశమే హద్దుగా ఎదగాలి

## : మండల విద్యాధికారి డాక్టర్ రామ్ధన్





**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోమార్చి 5 (జర్నలిస్ట్ వార్త):** విద్యార్థులు అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆకాశమే హద్దుగా ఎదగాలని ధర్మసాగర్ మండల విద్యాధికారి డాక్టర్ రామ్ధన్ అన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, సామాజిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న మెరిట్ విద్యార్థులకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నారాయణగిరిలో ఒకరోజు ఓరియంటేషన్ శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన డాక్టర్ రామ్ధన్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పోటీ తత్వం రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మంచి వసతులు, నాణ్యమైన బోధన అందుబాటులో ఉన్నాయని, వాటిని వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ధర్మసాగర్ స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయుడు ధర్మప్రకాశ్ రెగ్యులర్ తరగతుల్లో బోధనకు, ఓరియంటేషన్ కార్యక్రమాల్లో నిపుణులు అందించే మార్గదర్శకానికి మధ్య ఉన్న తేడాను వివరించారు. ధర్మసాగర్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళి మాట్లాడుతూ జీవితంలో ఎదగాలంటే క్రమశిక్షణ ఎంతో అవసరమని తెలిపారు. సమన్వయకర్తగా ఉపాధ్యాయురాలు సుదిలా రాణి వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమాదేవి (తెలుగు), రాధిక (హిందీ), ధర్మప్రకాశ్ (ఆంగ్లం), తులసి (గణితం), వేణుగోపాల్ (భౌతిక శాస్త్రం), శ్వేత (జీవశాస్త్రం), నవీన్ కుమార్ (సాంఘిక శాస్త్రం) అంశ నిపుణులుగా పాల్గొని ఆయా విషయాల్లో కీలక కాన్సెప్టులు వివరించారు. పబ్లిక్ పరీక్షల్లో గరిష్ట మార్కులు సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

# ధర్మసాగర్ బాలికల ఉన్నత పాఠశాలలో మాజీ మంత్రి విజయ రామారావు సన్మానం

## మండల విద్యార్థులకు 350 సైకిళ్ల పంపిణీ





**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, మార్చి 5 (జర్నలిస్ట్ వార్త):** ధర్మసాగర్ బాలికల ఉన్నత పాఠశాలలో మాజీ మంత్రి విజయ రామారావుకు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా కెమెరా రోబికో సంస్థ, రఘు పిలక, మాజీ మంత్రి విజయ రామారావు సహకారంతో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 350 సైకిళ్లను పంపిణీ చేశారు. విద్యార్థులు విద్యలో రాణించి మంచి భవిష్యత్తు సాధించాలనే లక్ష్యంతో ఈ సైకిళ్లను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి విజయ రామారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న అనేక మంది విద్యార్థులు పాఠశాలకు దూర ప్రాంతాల నుంచి రావాల్సి వస్తుందని, అలాంటి వారికి సైకిళ్లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పాఠశాలకు చేరుకొని చదువులో ముందుకు సాగేందుకు ఈ సైకిళు ్లదోహదపడతాయని పేర్కొన్నారు. సైకిల్ తొక్కడం వల్ల విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే వారు చదువులో మెరుగైన ఫలితాలు సాధించగలరని అన్నారు. శారీరక ఆరోగ్యం మంచి విద్యకు పునాది అని ఆయన వివరించారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులని, భవిష్యత్తులో సమాజాన్ని ముందుకు తీసుకెళ్లేది విద్యార్థులేనని తెలిపారు. అందువల్ల విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల్లో మంచి విలువలు, బాధ్యతాయుత భావన పెంపొందించేలా విద్యను బోధించాలని కోరారు. ఈ కార్యక్రమానికి సహకరించిన కెమెరా రోబికో సంస్థ ప్రతినిధులకు, రఘు పిలకకు, అలాగే పాఠశాల ఉపాధ్యాయులకు మాజీ మంత్రి విజయ రామారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల అభ్యున్నతికి దాతలు ముందుకు రావడం సమాజానికి మంచి సంకేతమని అన్నారు. ఈ కార్యక్రమంలో గురుజాల వీరన్న, మండల అధ్యక్షుడు బైరపాక కుమార్, జిల్లా నాయకులు అమరేందర్ రెడ్డి, రాములు, దుర్గ ప్రసాద్, రామ్మోహన్ రెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు కూడా కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సిరి వెలుగుల్లో మసకబారుతున్న మమతలు

# డబ్బే సర్వస్వం...ఆస్తిపాస్తులే పాధాన్యం...

నేటి ఆధునిక సమాజం నడుస్తున్న బాట ఇది. ధనమూలం ఇదం జగత్ అన్న సూక్తి పాతదే అయినా, నేడు అది కేవలం సూక్తిగా మిగిలిపోలేదు, ఒక కఠోర వాస్తవంగా రూపాంతరం చెందింది. రక్త సంబంధాలు, అనురాగాలు, ఆత్మీయతలు ఒకప్పుడు సమాజానికి పునాదులుగా ఉండేవి. కానీ నేడు ఆ పునాదులు కదులుతున్నాయి. మనిషి విలువను అతని గుణగణాల కంటే, అతని బ్యాంక్ బ్యాలెన్స్ బట్టే నిర్ణయించే విపరీత ధోరణి పెచ్చుమీరుతోంది.

**ఆస్తి ముందు తలవంచుతున్న ఆత్మీయత**

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల్లో కష్టసుఖాలను పంచుకోవడం ఒక సంప్రదాయం. నేడు విభక్త కుటుంబాల యుగంలో, ఆ పలకరింపులు కూడా కరువయ్యాయి. కన్నవారిని కంటికి రెప్పలా చూసుకోవాల్సిన బాధ్యతను ఖర్చుగా భావించే దుస్థితికి మనసు దిగజారింది. ఆస్తి పంపకాల్లో తలెత్తే వివాదాలు తోడబుట్టిన వారి మధ్య పగ ప్రతీకారాలను రగిలిస్తున్నాయి. నా వాడు అనుకునే ప్రేమ కంటే, నాకేం వస్తుంది? అన్న స్వార్థమే నేటి బంధాలకు గీటురాయిగా మారుతోంది.

**యాంత్రిక జీవనంలో ఆవిరవుతున్న అనురాగం**

సాంకేతికత పెరిగి లోకం చిన్నదైందని మురిసిపోతున్నాం కానీ, మనుషుల మధ్య దూరం పెరుగుతోందని గమనించలేకపోతున్నాం. పండుగలు, పబ్బాలు కూడా నేడు సామాజిక మాధ్యమాల్లో ఫోటోలకు, లైకులకు పరిమితమవుతున్నాయి. ఎదురుగా కూర్చున్న మనిషితో మనసు విప్పి మాట్లాడే సమయం లేదు కానీ, ప్రపంచంలోని ఎక్కడో ఉన్న అపరిచితులతో గంటల కొద్దీ గడిపేస్తున్నాం. కష్టం వస్తే ఓదార్చే చేయి కంటే, ఆ కష్టాన్ని సెల్ఫీ తీసి పోస్ట్ చేసే వేళ్లే ఎక్కువవుతున్నాయి.

**విలువల పునరుద్ధరణే మార్గం**

సమాజం ఇలాగే పతనమైతే, భవిష్యత్తులో మనిషి కేవలం ఒక యంత్రంలా మిగిలిపోయే ప్రమాదం ఉంది. పిల్లలకు చిన్నతనం నుంచే డబ్బు కంటే గొప్పది మానవత్వం అని నేర్పాలి.
బిజీ జీవితంలో కనీసం రోజుకు ఒక గంటైనా కుటుంబ సభ్యులతో గడపాలి.
మన ఎదుగుదలకు తోడ్పడిన వ్యక్తులను, కన్నవారిని గౌరవించడం బాధ్యతగా గుర్తించాలి.
డబ్బు ఈరోజు ఉంటుంది, రేపు పోతుంది. కానీ విడిపోయిన మనసులు, విచ్ఛిన్నమైన బంధాలు మళ్లీ తిరిగి రావు. ఆస్తి కంటే ఆత్మీయతే మిన్న అన్న సత్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించినప్పుడే సమాజం ఆరోగ్యకరంగా ఉంటుంది. మేధస్సు వెనుక పరుగులు తీస్తున్న మనిషి, కాస్త మనసు వైపు కూడా చూడాలి. అప్పుడే మనిషికి, మానవత్వానికి నిజమైన సార్థకత లభిస్తుంది.



సీనియర్ జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్.
సెల్ నంబర్ 9701249103

# వాటర్ ప్లాంట్ కోసం గది నిర్మాణం



**రాయపర్తి/మార్చి 5: (జర్నలిస్ట్ వార్త);** మండలంలోని జయరాం తండా (ఎస్) గ్రామంలో తండా ప్రజల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని వాటర్ ప్లాంట్ ఏర్పాటు కోసం గది నిర్మాణం చేపట్టారు. తండా ప్రజలు వాటర్ ప్లాంట్ కోసం గది కావాలని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డిని కోరగా ఆయన వెంటనే స్పందించి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గది నిర్మాణం ప్రారంభించారు. గురువారం నిర్మాణ పనులను బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు అవసరమైన సౌకర్యాల కోసం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్ నాయక్, సర్పంచ్ సంతోష్, మండల పార్టీ అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, లేతాకుల రంగారెడ్డి, గజవెల్లి ప్రసాద్, కోలా సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో గుర్తుతెలియని మృతదేహం



**రాయపర్తి/మార్చి 5(:జర్నలిస్ట్ వార్త):** రాయపర్తి మండలం మైలారం గ్రామ శివారులోని బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గురువారం రిజర్వాయర్‌లో చేపలు పట్టేందుకు వెళ్లిన జాలర్లకు నీటిలో తేలియాడుతున్న మృతదేహం కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇటీవల రిజర్వాయర్‌లో నీటి ప్రవాహం తగ్గడంతో మృతదేహం ఒడ్డుకు కొట్టుకువచ్చినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి వివరాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గుర్తింపు కోసం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# వికలాంగుడికి త్రీ వీలర్ వాహనం అందజేత



**తల్లాడ/మార్చి 5 (జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని క్రీస్తు సంఘం మందిరంలో బైబిల్ బోధకుడు బ్రదర్ చంటిబాబు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. బ్రదర్ కె. ఇశ్రాయేల్ ఆధ్వర్యంలో వికలాంగ సోదరుడు తెల్లపుట్ట కృష్ణకు క్రీస్తు సంఘం తరపున త్రీ వీలర్ వాహనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం క్రైస్తవ ధర్మంలో ముఖ్యమైన బాధ్యత అని తెలిపారు. వికలాంగుడు కృష్ణకు ఈ వాహనం ఎంతో ఉపయోగపడుతుందని, ఆయన స్వయం గా పనులు చేసుకునేందుకు ఇది తోడ్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సులోమాను, యోనా, బాబురావు, దైవ సహాయం, ఇశ్రాయేలు, దైవ సేవకులు నారపోగు ప్రసాదు బాబు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి.

## -కేవీకే మల్యాల శాస్త్రవేత్త డా.క్రాంతి కుమార్.




**బయ్యారం/మార్చి 5 (జర్నలిస్ట్ వార్త);** రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చనికేవీకే మల్యాలకు చెందిన శాస్త్రవేత్త డా. క్రాంతి కుమార్ అన్నారు. గురువారం బయ్యారం మండలం కొత్తపేట గ్రామంలోని రైతు వేదికలో జాతీయ సహజ వ్యవసాయ మిషన్ పై అవగాహన కార్యక్రమం బయ్యారం మండల వ్యవసాయ అధికారి కే.రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్, డా. క్రాంతి కుమార్ ముఖ్య అతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ సహజ వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను రైతులు ఎక్కువగా అవలంబించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రైతులకు అందుబాటులో ఉన్న సదుపాయాల గురించి కొత్తపేట క్లస్టర్ రైతులకు వివరించారు. రైతులు అడిగిన వరి పంటలో కాండం పురుగు సమస్యతో పాటు ఇతర వ్యవసాయ సమస్యలపై ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి తగిన సూచనలు అందించారు. అనంతరం బయ్యారం మండల వ్యవసాయ అధికారి, రైతులతో కలిసి డా. క్రాంతి కుమార్ ని కోటగడ్డ గ్రామంలోని వరి పంట పొలాలకు తీసుకెళ్లి అక్కడ పంట పరిస్థితిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జి.నాగరాజు, ఏఈఓ, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి స్లాబ్ కార్యక్రమం లో పాల్గొన్న దుద్దుకూరి సుమంత్

**జూలూరుపాడు/మార్చి5 (జర్నలిస్ట్ వార్త);**



మండలం పరిధిలో నేనుగుండెపుడి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుడు వీరబోయిన నవీన్ ఇంటి స్లాబ్ పనులను కాంగ్రెస్ జిల్లా నాయకులు దుద్దుకూరి సుమంత్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఒక వరమన్నారు. పూరి గుడిసె లేని సమాజాన్ని తయారుచేయటమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని అని అన్నారు. గ్రామంలో ఇల్లు లేని పేదలందరికి వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్ సహకారంతో ఇందిరమ్మ ఇల్లు అందించటమే తన లక్ష్యమని అని అన్నారు. పునులు పూర్తి ఐన వారం రోజులలనే బిల్లులు పడటం చాలా గొప్ప విషయం అన్నారు. పురుగుడిసె లేని సమాజం తయారుకావాలంటే ప్రజలందరు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ పెద్దలు కాళ్ళూరి వెంకటేశ్వరావు, గ్రామ శాఖ అధ్యక్షులు గాదె కృష్ణయ్య,మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కంచర్ల హరీష్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు యండపల్లి చిట్టిబాబు,మద్దిబోయిన నాగరాజు, జవ్వాది వీరయ్య, చింతకాయల శ్రీను,గాదె సురేష్, పొనుగుపాటి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన బయ్యారం సర్పంచ్.



**బయ్యారం/మార్చి 5,(జర్నలిస్ట్ వార్త);**
జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ను బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ దంపతులు మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా బయ్యారం మండల కేంద్రంలో గల పలు సమస్యలు తీర్చాలని కలెక్టర్ దృష్టికీ తీసుకొచ్చారు.సమస్యలను సంబంధిత శాఖ అధికారులు త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని సర్పంచ్ శాంతికిషన్ నాయక్ తెలిపారు.

# బాధితుడి ఇంటి వద్దకే పోలీసులు.

## స్పాట్ లోనే ఎఫ్ఐఆర్ నమోదు. -ఎస్సై తిరుపతి.

**బయ్యారం/మార్చి 5(జర్నలిస్ట్ వార్త).**




ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా, వెంటనే స్పందించి సహాయం అందుతుందని బయ్యారం పోలీసులు నిరూపించారు.వివరాల్లోనికి వెళితే ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పిర్యాదు ఇవ్వలేని స్థితిలో మండల కేంద్రంలో రాయల సతీష్ తీవ్ర గాయాలతో నడవలేని పరిస్థితిలో ఉండడంతో బాధితుడు ఒక్క ఫోన్ కాల్ తో జరిగిన సంఘటనపై దర్యాప్తు చేసి నిందితులపై బిఎన్ ఎస్ చట్టం కింద ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేసి,ఎఫ్ఐఆర్ కాపీ ని బాధితుడికీ అందించారు.శాంతి భద్రతలను కాపాడేందుకు నిత్యం పనిచేస్తామని భరోసా కల్పించారు.బాధితుడి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని,న్యాయం ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో సంఘటన స్థలంలోనే ఆన్-సైట్ ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు.పోలీస్ స్టేషన్‌కు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నా కూడా ప్రజలు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, పోలీసులు ప్రజల భద్రత కోసం మహబూబాబాద్ జిల్లా పోలీసులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని ఈ ఘటన ఉదాహరణ అని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో పోలీసులు స్వయంగా ప్రజల వద్దకే వెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# వ్యవసాయంలో ఆధునిక విప్లవం

## ఐనవోలులో డ్రోన్ల పంపిణీని ప్రారంభించిన జిల్లా కలెక్టర్








**ఐనవోలు/మార్చి5(జర్నలిస్ట్ వార్త);**
వ్యవసాయ రంగంలో సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారానే రైతులు అధిక లాభాలు గడించవచ్చని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పేర్కొన్నారు. బుధవారం ఐనవోలు మండల కేంద్రంలో నాబార్డ్ పథకం కింద వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రైతు సేవా సహకార సొసైటీ (నందనం)కు కేటాయించిన డ్రోన్లను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీజీ క్యాబ్ , డీసీసీబీ మాజీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు కూడా పాల్గొని రైతులకు డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పించారు.

**డ్రోన్ల వినియోగంతో బహుళ ప్రయోజనాలు**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ఖర్చు, సమయం ఆదా: డ్రోన్ల ద్వారా ఎరువులు, పురుగుమందులను తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో పిచికారీ చేయవచ్చు.
**సమర్థత:** సంప్రదాయ పద్ధతుల కంటే డ్రోన్ల ద్వారా మందుల వినియోగం చాలా సమర్థవంతంగా జరుగుతుందన్నారు. **ఆధునికత:** రైతులు పాత పద్ధతులకు స్వస్తి చెప్పి, ఇలాంటి అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. నందనం రైతు సేవా సహకార సొసైటీతో పాటు నర్సంపేట , నెల్లికుదురు లకు కలిపి మొత్తం 3 డ్రోన్లను అందజేశారు. వ్యోమిక్ డ్రోన్స్ సంస్థ ప్రతినిధులు హనుమ, జగదీష్ డ్రోన్ల పనితీరు, సాంకేతిక అంశాలను కలెక్టర్‌కు వివరించారు. డ్రోన్ల వాడకం వల్ల పంట దిగుబడి పెరగడమే కాకుండా, రైతుల శ్రమ తగ్గుతుందని మార్నేని రవీందర్ రావు తెలిపారు.ఈ కార్యక్రమంలో సహకార సంఘాల ప్రతినిధులు, వ్యవసాయ అధికారులు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులు సేవా దృక్పథం కలిగి ఉండాలి.


## -డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి.రాజు




**బయ్యారం/మార్చి 5(జర్నలిస్ట్ వార్త).**జాతీయ సేవా పథకం గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని బయ్యారం మండలం నామాలపాడు గ్రామంలో గురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి.రాజు అధ్యక్షత నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ ఎం.అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గారు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ద్వారా సేవా దృక్పథాన్ని అలవర్చుకోవలన్నారు. అదేవిధంగా నాయకత్వ లక్షణాలు విద్యార్థిని విద్యార్థులు పెంపొందించుకోవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ అనిల్ కుమార్ గారు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ కార్యక్రమం ద్వారా విద్యార్థిని విద్యార్థులు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడతారని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వర్స దీపా ప్రకాష్ దొర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.పున్నమి చందర్,కళాశాల ఆధ్యాపకులు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా డిప్యూటీ సీఎం తనయుడి వివాహం

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నాగా సీతారాములు



**హైదరాబాద్/మార్చి 5(జర్నలిస్ట్ వార్త);**తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారి కుమారుడు సూర్య విక్రమాదిత్య, సాక్షిల వివాహ వేడుక శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలోని జిఎం ఆర్ అరేనాలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ శుభకార్యానికి రాజకీయ, సామాజిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై సందడి చేశారు.తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు ఈ వివాహ వేడుకకు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. వధూవరులు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నాగా సీతారాములు గారితో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు టీపీసీసీ జనరల్ సెక్రటరీ నల్లపు దుర్గాప్రసాద్ సేవాదళ్ నాయకులు కొదుమూరి దయాకర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అర్జున్ రావు, వీరబాబు యూత్ కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షులు షేక్ అబిద్ ఇతర పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని డిప్యూటీ సీఎం కుటుంబానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఐనవోలు విద్యార్థుల ఎంపిక

**ఐనవోలు/మార్చి5(జర్నలిస్ట్ వార్త);**





క్రీడల్లో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఐనవోలు మహాత్మా జ్యోతిబాపూలే (బాలుర) పాఠశాల విద్యార్థులు మరోసారి నిరూపించారు. ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పాఠశాలల క్రీడల సమాఖ్య సాఫ్ట్ బాల్ పోటీలకు ఈ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 8వ తేదీన నెల్లికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో 14 ఏళ్ల లోపు బాలబాలికల సాఫ్ట్ బాల్ జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుండి సుమారు 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. తీవ్రమైన పోటీ నెలకొన్నప్పటికీ, ఐనవోలు మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలకు చెందిన టి. మాధవ వర్ధన్ (తొమ్మిదవ తరగతి) పి. చరణ్ తమ అద్భుతమైన క్రీడా నైపుణ్యంతో అందరినీ ఆకట్టుకుని రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు.ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 7, 8, 9 తేదీలలో మహబూబాబాద్ జిల్లాలోని నెల్లికుదురులో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి 14 ఏళ్ల లోపు సాఫ్ట్ బాల్ పోటీలలో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు.
రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులను, వారిని తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులు సందీప్ గారిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు (ప్రిన్సిపాల్) తిరునగిరి శ్రీలత ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో రాష్ట్ర స్థాయికి ఎదగడం గర్వకారణమని, వీరు రాష్ట్ర స్థాయిలో విజయం సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఉపాధ్యాయ బృందం ఆకాంక్షించారు

# సింగారం చెరువులో అస్థిపంజరం

## మిస్టరీ వీడింది - మృతుడు యాచకుడు గట్టయ్యగా గుర్తింపు

**ఐనవోలు/మార్చి5(జర్నలిస్ట్ వార్త);**



గత కొన్ని రోజులుగా ఐనవోలు మండలం సింగారం గ్రామ శివారులోని ఊర చెరువులో కనిపిస్తున్న గుర్తు తెలియని అస్థిపంజరం కేసును పోలీసులు ఛేదించారు. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు విచారణ చేపట్టిన పోలీసులు, ఆ మృతదేహాన్ని గుర్తించారు. మృతుడు తిమ్మాపూర్ రామాలయం వద్ద యాచకుడిగా జీవనం సాగించే గట్టయ్య అని పోలీసులు నిర్ధారించారు. సింగారం గ్రామ పరిపాలన అధికారి అనిల్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐనవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్ కేసు నమోదు చేశారు.
ఘటనా స్థలంలోనే విచారణ: కేఎంసీ ప్రొఫెసర్ సమక్షంలో చెరువు వద్దే శవపంచనామా నిర్వహించారు. అధికారుల సమక్షంలో: ఈ పంచనామాలో రెవెన్యూ విభాగం, జి.డబ్ల్యూ.ఎం.సి అధికారులు పాల్గొన్నారని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.గత కొద్ది రోజులుగా స్థానికంగా కలకలం రేపిన ఈ అస్థిపంజరం మిస్టరీ, పోలీసుల సత్వర విచారణతో ముగిసింది.

# నేటి నుంచి 99 రోజుల ప్రజాపాలన

## ప్రత్యేక లోగో ఆవిష్కరించిన ప్రభుత్వం

**హైదరాబాద్,మార్చి5(జర్నలిస్ట్ వార్త);**
99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లోగోను ప్రభుత్వం ఆవిష్కరించింది. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగనున్నారు. మార్చి 6 నుంచి ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుజిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక నిర్వహణపై జిల్లా కలెక్టర్లకు ఇటీవలే సిఎం నిర్దేశం

ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక
99 DAYS ACTION PLAN

చేశారు.మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ప్రజా పాలన..ప్రగతి ప్రణాళిక అయిదు దశల్లో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఈ కార్యక్రమ నిర్వహణపై ఉమ్మడి జిల్లా కేంద్రంలో జిల్లా ఇన్చార్జి మంత్రితో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి, ఈ సమావేశానికి జిల్లాలోని ప్రముఖ ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని తెలిపారు. ఈనెల 12 వ తేదీన ఆయా జిల్లాల్లో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లు, మేయర్లు, వార్డు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు , సర్పంచులకు అవగాహనా సదస్సులు నిర్వహించాలని అన్నారు. ఇందుకుగాను పంచాయితీ రాజ్, మున్సిపల్ శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తాయని అన్నారు. ఈ 99 రోజుల ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమం గ్రామ, మండల, నియోజక వర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించడం జరుగుతుందని మరోసారి తెలిపారు. దీనికి సంబంధించి ఎప్పటికప్పుడు తగు మార్గ దర్శకాలను జారీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.